పొగమంచు

సీరియల్

ముద్దా సురేష్

S 12

(తొమ్మిదవ భాగము)

"విశ్వామిత్ర మైక్రోప్లాస్మాను మార్పులు చేసి సాధించిన యీ ప్రక్రియను మ్యుటేషన్ (Mutation) అంటారు. విశ్వామిత్ర మరణించిన తర్వాత యిక ఆ మ్యుటేషన్‌ని హేండిల్ చేయడం, ఉపయోగించడం యెంత ప్రమాదకరమో మాకు తెల్సింది. దాన్ని వదిలించుకోవాలని రక్షణశాఖ భావించింది. దాన్ని వదిలించుకోడానికి మూడు పద్ధతులు ఉన్నాయి. ఒకటి—దాన్ని నాశనం చేయడం, రెండు—సముద్రంలో కప్పెడ్డం, మూడు—భూగర్భంలో లోతుగా పాతిపెట్టడం."

"మైగాడ్!" విస్తుపోయాడు ప్రొఫెసర్ సన్యాల్. బరువుగా ఊపిరి పీలుస్తూ "దాన్ని అప్పుడు భూమిలో పాతిపెట్టడానికి మీరు నిర్ణయించారన్నమాట!"

"'నేను' కాదు మిస్టర్ సన్యాల్! అప్పుడు వున్న నాపై అధికారులు. ఇది పది సంవత్సరాల క్రిందటి సంగతి అని మరువకూడదు."

"కారీ ఆన్ మిస్టర్ సేన్!" హోమ్ సెక్రెటరీ కంఠం కరుగ్గా పలికింది.

"మొదటి పద్ధతి ప్రకారం దాన్ని నాశనం చేయడం యెలాగో మాకు తెలీదు. రెండో పద్ధతి ప్రకారం సముద్రంలో దాన్ని పాతిపెట్టడం ప్రమాదకరం అని భావించాం. అందుచేత మూడో ఆల్టర్నేటివ్ తప్పలేదు. భూగర్భంలో చాలా చాలా లోతుగా సీసపు కాప్స్యూల్స్‌లో బంధించి, దాన్ని మళ్ళీ స్టీల్ గొట్టంలో సీలు చేసి పాతిపెట్టాం."

"భూకంపం వచ్చిన గ్రామం క్రింద" అన్నాడు రాణా.

"కాదు. మేము మైక్రోప్లాస్మా మ్యుటేషన్‌ని కనిపెట్టింది సరిగ్గా ఆ గ్రామానికి అరమైలు దూరంలో"
అన్నాడు ప్రచండసేన్ రాణాకేసి యిబ్బందిగా చూస్తూ.

"గో ఆన్ మిస్టర్ సేన్!" అన్నాడు మళ్ళీ హోం సెక్రటరీ కళ్ళాల్ని తన చేతులలో పట్టుకుని, వాదోపవాదాలు చెలరేగే ప్రమాదాన్ని నివారించే ప్రయత్నంలో.

"మైక్రోప్లాస్మా ప్రభావాన్ని గురించిన వివరాలు, దాన్ని సమాధిచేసిన స్థలం వివరాలు మొదలగునవన్నీ ఓ ఫైల్లో పొందుపరచబడి రహస్యంగా దాచబడింది. తర్వాత...యిప్పుడు..." తటపటాయిస్తూ ఉండిపోయాడు ప్రచండసేన్ ఏ ప్రభావమూ లేని ముఖాల వైపు చూస్తూ "కొ....కొద్ది వారాల క్రితం ఆర్మీ భూగర్భంలో ప్రేలుడు పరీక్ష...."

"వో ముఝే మాలూమ్ హై!" అరిచాడు ప్రొఫెసర్ సన్యాల్, ఉద్రేకంగా పైకిలేస్తూ "ఆర్మీను ప్రజలు యిక్కడ్నుంచీ బాగా విశ్వశిస్తారు. ఖుల్నా ఏరియాలో 150 ఎకరాల స్థలం ఏడుస్తూండగా, యింతకుముందు ప్రాణాంతకమయిన వ్యాధిని పాతిపెట్టిన ఆ స్థలం మాత్రమే దొరికింది మీకు భూగర్భంలో బాంబు ప్రయోగాలు చేయడానికి. అంతేనా?"

"సర్టెన్లీ నాట్! ఈ భూగర్భ ప్రేలుడు ప్రయోగం అక్కడ్నుంచీ రెండు మైళ్ళ కివతల జరిగింది!"

"అయితే భావ్‌నగర్ గ్రామం రెండుగా చీలిపోవడానికి కారణం ఏమిటి?"

"ప్రొఫెసర్ సన్యాల్! ప్లీజ్ సిడౌన్. విల్ యూ?" తీవ్రమయిన కంఠంతో ఆదేశించాడు హోం సెక్రటరీ. "మీకు ముందే హెచ్చరిక చేసాను. ఈ

సమావేశం కొట్లాట సఫలంగా మారడానికి నేను అనుమతించను. మనం యిక్కడ సమావేశమయింది ఓ పరిష్కారం కనుక్కోడానికి. మిస్టర్ ప్రచండసేన్! ప్లీజ్ కంటిన్యూ....”

“మేము ఒక శక్తివంతమయిన కొత్త ఎక్స్‌ప్లోజివ్ పై ఎక్స్‌పెరిమెంట్ చేస్తున్నాం. ఇరవై సంవత్సరాలుగా భూమిలోనికి తీసుకునిపోయి యిలాంటి ప్రయోగాలు చేస్తున్నాం. ఇది మొదటిసారిగా కాదు. చాలా దేశాలు యిదే పద్ధతిని అవలంబిస్తాయ్, తమ బాంబుల యొక్క శక్తిని పరీక్షించడానికి. ఇలా కాకుండా భూమి ఉపరితలంపై యీ ప్రయోగంచేసి గ్రామాన్ని యెగరగొట్టడం మంచిదంటారా సన్యాల్?”

“మీరు అసలు ఏ బాంబునీ పరీక్ష చేయకపోవడం మంచిదంటాను” అన్నాడు సన్యాల్ కసిగా.

“అప్పుడు రక్షణశాఖ మనుగడకే అర్థం లేదు. ఇక పోతే యిది యే రకం బాంబో మీకు బయటపెట్టలేకపోతున్నందుకు క్షమించాలి. ఇది భూమి పొరల్లో అతి వేగంగా, అడ్డంగా పగులు సృష్టించింది. దీనివల్లనే భూకంపం, భూమి చీలిపోవడం, మైక్రోప్లాస్మా బయట పడడం జరిగాయ్.”

“దీని అర్థం రెండు మైళ్ళ దూరం అవతల ఆ విధమయిన ప్రమాదాన్ని కలిగించే బాంబు మీరు ప్రయోగించారనా?”

“అవును. కాని ఆ సమయంలో ఆ విషయం తెలియదు. ప్రేలుడు చుట్టూ భూమి విపరీతంగా కూలిపోయింది. కాని బాంబు సృష్టించిన ప్రకంపనాన్ని భూమిలో అడ్డంగా ఏర్పడ్డ పగులు కొన్ని మైళ్ళ దూరం

వరకూ విద్యుత్‌లా వ్యాపించింది. ఈ పగులు సీసపు కాప్‌స్యూల్ నిక్షిప్తం చేయబడ్డ ప్రదేశాన్ని తీవ్రంగా తాకి ఉండాలి. నేలలో ఒత్తిడివల్ల అది చటుక్కున విడిపోయింది. మైక్రోప్లాస్మా బైటపడింది. అత్యంత వేగంగా పరిగెట్టే యీ పగులు ప్రకంపనం, భావ్‌నగర్‌లో క్రింద నుంచి భూమి ఉపరితలాన్ని తాకే దాకా నెమ్మదించలేదు.”

“మీరు సృష్టించిన ఎక్స్‌ప్లోషన్ వల్ల భూకంపం ఏర్పడిందని మీకు తెలుసు. అయినా మీ డిపార్టుమెంటు యిన్నాళ్ళూ యీ విషయాన్ని బయటకు చెప్పలేదు” అన్నాడు సన్యాల్ నిందాపూర్వకంగా.

ప్రచండసేన్ తల వూపాడు.

అందరి కళ్ళూ సేన్‌మీద నిల్చిపోయాయి, అతడొక్కడే యీ సర్వనాశనానికీ కారణమన్నట్లుగా.

ఎవరైనా మాట్లాడే అవకాశం యివ్వకుండా హోం సెక్రెటరీ వెంటనే కలగజేసుకున్నాడు. “మాకు ముందుగానే తెల్సు. అయినా ఆ విషయాలు బయటపెట్టడం వల్ల ఎట్టి ప్రయోజనం లేదని భావించాం ఈ రోజు దాకా. థాంక్యూ ప్రచండసేన్!”

తన బాధ్యత తీరినందుకు ప్రచండసేన్ గుండె తేలికపడి విశ్రాంతిగా నిట్టూర్పు విడుస్తూ కూర్చున్నాడు.

హోం సెక్రెటరీ తిరిగి ప్రారంభించాడు. “జంటిల్మెన్! యిది ఆరోపణలకు, క్షమాపణలకు సమయం కాదు. ఇప్పుడు మన ముందు అన్ని నిజాలు బయటపడ్డాయి. కాబట్టి పరిష్కారమార్గం చర్చిద్దాం. బొంబాయికి ఉత్తరాన ఉన్న బస్సీన్ పట్టణంలోకి అడుగుపెట్టకుండా యీ విషమేఘంతో చేసిన పోరాటంలో మనం

ఓడిపోయామని చెప్పడానికి విచారిస్తున్నాను. అదృష్ట వశాత్తూ బస్సీన్ ప్రజలందర్నీ ఊరినుంచి ఖాళీ చేయించడం జరిగింది."

"ఏ విధంగా ప్రయత్నించారు దాన్ని ఆపడానికి?" అడిగేడు రాణా.

"పెర్‌హాప్స్ యు విల్ టెల్ అజ్ రణధావే?" హోం సెక్రెటరీ ఆర్మీ అండర్ సెక్రెటరీ రణధావే వైపు తిరిగాడు.

"ఎస్" తల ఊపాడు రణధావే. "ఈ పొగమంచును ఎదుర్కోడానికి నాలుగు రకాల పద్ధతు లున్నాయ్. ఇప్పుడు మనం అనుసరిస్తున్న విధానం - తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలనుండి మేఘం మీదికి 'కాల్షియం క్లోరైడ్' ద్రవాన్ని చల్లడం. శీతలదేశాల్లో పొగమంచుని నివారించడానికి యీ పద్ధతి అమలుచేస్తారు. ఇది గాలిలో తేమను వేడిచేసే ఒక రసాయనం. కాని యీ విధంగా మనం టన్నుల రసాయనాన్ని ఖర్చుచేసినా ఫలితం లేకపోయింది. ఇది చాలా ఖరీదయిన పద్ధతి కూడా. కొంత పొగమంచు అదృశ్యమయింది. కాని యీ పొగమంచుకి తనను తాను ఉత్పత్తి చేసుకునే లక్షణం వుంది. అది తనకు తాను పెద్దదవుతూ పెరిగిపోతూ వుంటే మనం చేయగలిగిందేముంది?"

"మిగతా పద్ధతులు ఉపయోగించారా?" అడిగాడు ప్రొఫెసర్ సన్యాల్.

"ఇంకా లేదు. కారణం సమయం లేకపోవడంవల్ల. ఏది యేమయినా యిప్పుడు అమలుపర్చిన విధానమే యెక్కువ ఉపయోగకరమయినది. మిగతా పద్ధతులు చెప్పినప్పుడు మీకు యీ విషయం అర్థమవుతుంది.

"యుద్ధాల్లో F100 అనే పురాతన పద్ధతి ఒకటి అమల్లో ఉండేది. ఇది కూడా ఖరీదయినా విధానమే. కాని యిప్పుడెక్కడా ఆచరణలో లేదు. దట్టమయిన మంచుతో నిండిన సరిహద్దులు యీ రోజుల్లో పెద్ద సమస్య కాదు. ఎందుకంటే రాడార్ అభివృద్ధి చెందింది కాబట్టి. అప్పటి పద్ధతి చెప్తాను. పెట్రోలు సహాయంతో ప్రత్యేకమయిన పద్ధతుల్లో ఎయిర్ ఫీల్డు చుట్టూ వున్న తేమను వెచ్చపరిచేవారు. అది వాతావరణంలో వేడి సృష్టించే కొలదీ తేమ తొలగిపోయి నీటిబొట్టులు ఏర్పడి తిరిగి ఆవిరిగా మారి, పొగమంచు మాయమయ్యేది, యుద్ధ విమానాలు లాండ్ కావడానికి వీలుగా.

"పట్టణమంతా యీ పద్ధతి ప్రవేశపెట్టాలంటే అంత టైం మనకు లేదు. ఇలా చేయటంవల్ల మనం సాధించేది పొగమంచును అవతలికి నెట్టడం మాత్రమే. దాన్ని మొత్తం నాశనం చేయలేము."

"మూడవ పద్ధతి అల్ట్రాసోనిక్ తరంగాల్ని ఉపయోగించడం. ఒక ప్రదేశంలో వెనక్కి, ముందుకీ అతి తీవ్రంగా గాలిలో యీ శబ్దతరంగాల్ని ఉత్పత్తి చేయడం వల్ల గాలిలో తేమ నీటి బిందువులుగా మారి వర్షంగా కురుస్తుంది.

ఈ పద్ధతిలో సమస్య ఏమిటంటే—ఆ శబ్దతరంగాల ఒత్తిడి ప్రాణమున్న ఏ జీవికైనా హానికరం.

మరోసారి, ఈ పరిస్థితిని నిష్ప్రయోజనకరంగా భావించవొచ్చు. ఎందుకంటే విషమేఘాన్కి తనను తాను ఉత్పత్తి చేసుకొనే లక్షణం వుండడంవల్ల."

"ఆఖరి పద్ధతి?" అడిగాడు హోం సెక్రటరీ, ఆతృతగా.

"చివరి విధానం పూర్తిగా నిరుపయోగం. దానిలో కార్బన్-డై-ఆక్సైడ్‌ని ఉపయోగించాలి. కాని ప్రస్తుత సందర్భంలో.... ఈ విష మేఘం జీవించేది కార్బన్-డై-ఆక్సైడ్ ఆసరాతో నే.

"కార్బన్-డై-ఆక్సైడ్‌ని పొగమంచుమీద ప్రయోగించినపుడు, పొగమంచులో వుండే నీటి అణువులు-దగ్గరగా ఏర్పడి—బిందువులుగా మారి—బరువెక్కి నేలమీద పడ్డాయి. కాని ఈ కేసులో మైక్రోప్లాస్మాకు ఆహారం కార్బన్-డై-ఆక్సైడ్. మీరూహించుకోగలరు దాన్ని ప్రయోగిస్తే ఏమవుతుందో."

"ఇంతకీ మీరు చెప్పబోయేది మనం చేయగలిగేది ఏమీ లేదనా?" అన్నాడు సన్యాల్, సందేహాస్పదంగా చూస్తూ.

"ఇతర మార్గాల కోసం అన్వేషిస్తున్నాం!"

బలహీనమైన జవాబు వచ్చింది.

హోం సెక్రటరీ కలగజేసుకుంటూ అన్నాడు "ఈ విషయంలో పరిష్కారం కనుక్కోడానికి కావలసినంత మంది వైజ్ఞానికులు మన దేశంతా ఉన్నారని నా నమ్మకం. అమెరికా, రష్యాలు కూడా ఈ విషయంలో మనకు సహాయపడ్డాన్కి ముందుకు వచ్చాయి. చైనా కూడా మన పరిశోధనలలో—వారి శాస్త్రవేత్తలను పంపడం ద్వారా—చేయూతనివ్వడాన్కి ముందుకు వచ్చింది."

"ఒక విషయం మర్చిపోకండి. ఈ విష మేఘం సముద్రం దాటి మరి ఏ యితర దేశంమీదన్నా పడొచ్చు. ఈ ప్రమాదం మనకొక్కరికే కాదు. ప్రపంచానికే ఉమ్మడి శత్రువుగా మారింది.

ఈ పొగమంచుని మనం విడగొట్టలేకపోయినట్లయితే,

వ్యాధికి విరుగుడు మందు కనుక్కోవడం ఒక్కటే మిగిలిన ఆశ! ఈ సెరమ్‌ను కనుక్కోవాలంటే ముందుగా కొంత పరిమాణంలో, ఎంతయెక్కువ అయినప్పటికీ-ఈ మార్పులు చేయబడ్డ మైక్రోప్లాస్మాను సంగ్రహించవల్సి వుంది. ప్రొఫెసర్ అశ్వత్థామ చెప్పినట్లుగా — శుద్ధమైన రూపంలో."

"కాని అది యెంత అసంభవమో మీకు తెల్సు" అన్నాడు అశ్వత్థామ, విచారం గూడుకట్టుకున్న వదనంతో.

"ఎందుకు అసంభవం?" ఆశ్చర్యంగా చూశాడు సన్యాల్, సైంటిస్టు వేపు. "ప్రత్యేకమైన దుస్తులు ధరించి, ఊపిరి పీల్చుకునే పరికరాలు, మొదలైనవాటి సాయంతో ఎవరైనా విష మేఘం వద్దకి చేరవచ్చుకదా శాంపిల్ కోసం?"

"సమస్య విష మేఘాన్ని చేరటం గురించికాదు" చెప్పాడు అశ్వత్థామ "దాని మధ్యభాగంలో ప్రవేశించాలి."

"మ....ధ్య....భా...."

"ఎస్, మిస్టర్ సన్యాల్!" చెప్పాడు హోం సెక్రటరీ "విమానంలోని కొన్ని పరికరాలు విష మేఘం మధ్య భాగంలో ఒక విధమైన శక్తి ఉన్నట్లు కనిపెట్టాయి. ఇది నిస్సందేహంగా మైక్రోప్లాస్మాకు చెందిన న్యూక్లియస్. మనిషికి-గుండెకి ఏ విధమైన సంబంధముందో న్యూక్లియస్‌కీ మైక్రోప్లాస్మాకి అదే సంబంధం వుంటుంది."

"ఆ మెరుపు!" తటాలున అన్నాడు రాణా ఆశ్చర్యంగా "మేం పొగమంచులోంచి డ్రైవ్ చేస్తుండగా లూసీ ఒక మెరుపుని చూసానని చెప్పింది!"

"అవును రాణా!" తల వూపాడు అశ్వత్థామ. సైన్సు లోని ఆ శాఖలో ఏ విధమైన పరిచయంలేని ప్రొఫెసర్ సన్యాల్ చురుగ్గా పలికాడు "ఆల్ రైట్. పరిశుద్ధమైన కీలకపదార్థం విషమేఘం మధ్యభాగంలో ఉంటుందన్న మాట. ఆల్ ది సేమ్, మనిషి ఎందుకు వెళ్ళలేదు అందు లోకి, సరియైన ప్రొటెక్షన్ ఉంటే?"

అశ్వత్థామ, హోమ్ సెక్రటరీ వైపు సందిగ్ధంగా చూసాడు.

హోం సెక్రటరీ తల ఊపాడు, నిర్ధారణగా.

"విశ్వామిత్ర అజాగ్రత్తగా ప్రవర్తించాడని ఇంతకు ముందు చెప్పాం" అన్నాడు అశ్వత్థామ—సన్యాల్ వైపు చూస్తూ "కాని అతను చేసింది చిన్నచిన్న పొర పాట్లే. ప్రమాదకరమైన రసాయనాలతో పరిశోధనలు చేస్తున్నప్పుడు ఏ సైంటిస్టూ నిర్లక్ష్యంగా వుండడు. విశ్వామిత్ర అప్పుడు కూడా తలనుండి పాదంవరకూ సంరక్షక దుస్తులు ధరించాడు."

"హోలీగాడ్! విషమేఘం బారినుంచి రక్షించబడ్డానికి మనిషికి అసలు ఏ విధమైన ప్రొటెక్షన్ లేదంటారా?"

"ఉంటుంది. కాని మనిషి కదలడానికి వీలుగా వుండే సంరక్షక దుస్తులు మనకు కావాలి. ఎలాంటి దట్టమైన మూలపదార్థంతో చేయబడిన దుస్తుల్లో నుంచైనా ఈ పొగమంచు చొచ్చుకుపోగలదు."

"సీసంతో అల్లిన సూటు ధరిస్తే?" రాణా అడి గాడు. "ఈ విధమైన ఆపరేషన్ నిర్వహించడాన్కి అది అనుకూలం కాదు. పైగా చాల బరువుగాను, స్వేచ్ఛగా కదలడాన్కి యిబ్బందిగాను వుంటాయి ఆ దుస్తులు. ఈ సంరక్షక దుస్తులు ధరించిన వ్యక్తి దాదాపు

అర మైలు నడవాలి, విష మేఘం మధ్యభాగం చేరాలంటే. 'దట్టమైన' మేఘంలో దారి కనపడదు. పైగా-మధ్యలో వుండే మైక్రోప్లాస్మా చాల ఫవర్ ఫుల్ గా వుంటుంది. దాని దుష్టశక్తికి తట్టుకోగలమన్న గారంటీ లేదు."

ఏదో అనుమానం రాణా మెదడులో పొడసూపి నట్లయింది.

"మళ్ళీ వెనక్కి వచ్చాం. భద్రత పాయింట్ కి" అన్నాడు హోమ్ సెక్రటరీ వైపు సూటిగా చూస్తూ.

"ఎస్" అన్నాడు హోమ్ సెక్రటరీ ఏ విధమైన తత్తరపాటులేని స్వరంతో. "'ఈ వ్యాధినుండి భద్రత' కలిగిన వ్యక్తి మాకు కావాలి, లోపలికి వెళ్ళి శాంపిల్ తీసుకురావడానికి. ఆ వ్యక్తి....నువ్వొక్కడివే మిస్టర్ మహారాణా."

• • •

బస్సీన్ పట్టణం నిర్మానుష్యంగా ఉంది.

విష మేఘం ప్రవేశించడంవల్ల ప్రభుత్వం ప్రజలనందర్నీ ఊరినుండి ఖాళీ చేయించింది.

పసుపు పచ్చని ఛాయ కలిగిన దట్టమైన పొగమంచు వీధుల్లో ఆవరించింది.

నాలుగు మానవాకారాలు ఆ పొగ మంచులో ముందుకు అడుగులేస్తున్నాయ్.

మొదట నడిచే వ్యక్తి - ఒక చిన్న చక్రాలబండిని నడిపిస్తున్నాడు. దానిమీద పెద్ద పెట్టె వుంది. ఆ పెట్టెకు విచిత్రమైన పరికరాలు అమర్చబడి ఉన్నాయ్.

వెనక నడిచే వ్యక్తులు సురక్షిత (లోహపు) దుస్తులు ధరించారు. ముఖాలకు మాస్క్ లున్నాయ్.

బరువైన దుస్తులు ధరించిన ఓ వ్యక్తి రాణా

ముఖాన్ని తట్టేడు.

దాని అర్థం—

వారు అంతకు మించి ముందుకు నడవలేరు. నడవ కూడదు. మిగతా బాధ్యత అంతా రాణాదే!

ఆతని కంఠం సరిగ్గా వినబడటం లేదు ముఖానికి మాస్క్ వుండడంవల్ల. బొటనవ్రేలు పైకెత్తి 'ఓ.కే.' గుర్తు చూపాడతను.

విచిత్రమైన దుస్తులు ధరించిన ఆ ముగ్గురు సైంటిస్టులు ఆగిపోయారు.

మాస్క్ అద్దాల్లోంచి రెండడుగుల అవతల ఏముందో ఎవరికీ స్పష్టంగా కనబడడంలేదు - దట్టమైన పొగవల్ల.

రాణా విషయం అర్థంచేసుకున్నాడు.

అతని శరీరంమీద ఎలాంటి సురక్షిత దుస్తులూ లేవు- వీపు వెనకవున్న ఆక్సిజన్ సిలండర్ తప్ప.

రాణాకు కూడా సైటింస్టులు ఎవరెవరో తెల్సినా ఎవరు-ఎవరో తెలియటంలేదు మాస్క్‌లు వుండడంవల్ల.

అతని భుజంతట్టిన వ్యక్తి, రాణాకి చక్రాలబండిని అందజేసాడు. చిన్నదైనా, మోటారుతో, నడిచే బరువైన అధునాతన వాహనం ఆ ట్రాలీయంత్రం. ఐస్‌క్రీం తోపుడుబండిలా వుంటుందది. దాని హాండిల్‌కున్న బటన్ నొక్కితే, , అది ఆటోమాటిక్‌గా కదులుంది.... ఆ వ్యక్తి ట్రాలీ వేగాన్ని కంట్రోల్ చేయవచ్చు. రాణా, ఆ సైంటిస్టు చేతిని తట్టాడు కృతజ్ఞతా సూచకంగా....

ఆ మానవాకారాలు పసుపుపచ్చని పొగమంచు లోంచి నడుచుకుంటూ వెనక్కి వెళ్ళిపోయాయి.

రాణాలో అకస్మాత్తుగా భయం ఆవహించింది! భయంకరమైన ఒంటరితనం అతన్ని వేధించసాగింది.

తనని నరకంలో వదిలిపెట్టి వారు వెళ్ళిపోయినట్లు ఫీల య్యాడు. వాళ్ళని వెనక్కి పిలవాలన్న కోరికను బల వంతంగా ఆపుకున్నాడు రాణా.

కాని వారు యిప్పటికే పెద్దరిస్కు తీసుకున్నారని రాణాకి తెల్సు, తనని యిక్కడిదాకా తీసుకురావడం ద్వారా.

విష మేఘం అంచులు, ఎక్కువ శక్తివంతంగా వుండ వన్న ప్రదేశంతో వారు యిక్కడిదాకా వచ్చారు.

కాని అవి యెంతవరకు బలహీనమో వారికి స్పష్టంగా తెలీదు.

గతరాత్రి తను స్టడీచేసిన రోడ్డు మాప్‌ని గుర్తుచేసు కుంటూ ముందుకు కదిలాడు రాణా.

కళ్ళు మూసుకుని వెళ్ళినా అతను దారి తప్పడు. అంతగా బట్టీపట్టాడు రోడ్డుమాప్‌ని.

వీపునవున్న చిన్న ఆక్సిజన్ టాంకు నడవడాన్కి యిబ్బంది కల్గిస్తోంది.... కాని విష మేఘం దట్టమై, ఊపిరి పీల్చుకోడం కష్టమైతే దాని ఉపయోగం అంతా ఇంతా కాదని తెల్సు రాణాకి.

ట్రాలీని కంట్రోల్ చేసే బటన్ నొక్కి, ముందుకు నడుస్తున్నాడు రాణా.

గతరాత్రి అతనిని పరీక్ష చేసి 'రెండవసారి వ్యాధి సోకే ప్రమాదం' లేదని హామీ ఇచ్చారు డాక్టర్లు.

కాని 'నిర్ణయాధికారాన్ని' అతనికే వదిలేసారు.

విష మేఘాన్ని నాశనం చేయలేనట్లయితే, లక్షలాది ప్రజలు దిక్కులేని చావు చస్తారు.

ఒకే ఒక పరిష్కార మార్గం—విరుగుడు మందు కనుక్కోడం. ఈ ఎస్సైన్‌మెంట్‌లో సహాయపడగల

ఒకే ఒక వ్యక్తి—

తాను—

తను రక్షణశాఖ పొరపాట్లను ఎంత సేపు తిట్టిపోసినా ప్రయోజనంలేదు.

నడుంకట్టి నిర్మాణాత్మకమైన సహాయం చేయడానికి యిదే సమయం.

ప్రజలు ఈ భయం పూర్తిగా తొలగిపోయిన తర్వాత ఈ విషయం జ్ఞాపకం ఉంచుకుంటారా?

రాణా ఆలోచనలు లూసీ మీదకు మళ్ళాయ్.

గతరాత్రి ఆమె ముఖం తెల్లగా పాలిపోయి వుంది....

కాని....నిశ్చలంగా, మత్తులో పడివున్న పరిస్థితిలో కూడా ఆమె ముఖంలో అమాయకత్వం తెచ్చే అందం తగ్గలేదు....

తను ఆమె లేకుండా జీవించలేడు.

ఆమె లేకుండా జీవించడంకంటే, తను ఇప్పుడే మరణించడం మంచిది.

రాణా తక్కున నిల్చిపోయాడు....

ఒక్కక్షణంపాటు అతనకి దట్టమైన పొగలో ఏదో కదిలినట్లు అనిపించింది.

'లేక సుడులు తిరుగుతున్న మేఘం తన కళ్ళను మోసం చేస్తోందా?' సంధిగ్ధావస్థతో మళ్ళీ ముందుకి కదిలాడు రాణా.

ప్రక్కన వున్న భవనాలు కనబడేలా రోడ్డుకు సాధ్యమైనంత ఓరగా నడుచుకుంటూ వెళ్తున్నాడు రాణా.

మలుపు తిరగడానికి, వెనకాల వున్న ట్రాలీవల్ల ప్లాట్ ఫాంకి యివతలగా నడవాల్సి వస్తోంది.

లూసీ మీద రక్తశుద్ధి చికిత్స జయప్రదంగా ముగిసింది.

ఈ ఉదయం ఆమెకు రేడియోలజీ చికిత్స చేస్తారు....

రేడియేషన్ — చెడును కాల్చేస్తుంది....

ఎక్స్‌రే కిరణాల యొక్క యాంగిల్ అస్తమానూ మారుస్తారు ఆరోగ్యవంతమైన మెదడు కణాలు పాడై పోకుండా—

ఈ చికిత్స ఫెయిలయితే?

ఆ ఆలోచన తను భరించలేడు—

భగవాన్! నా లూసీని నాకు దక్కించు!

లోలోపల ప్రార్థించాడు రాణా బేలగా.

రాణా ముదురుపసుపులోకి మారుతూ దట్టమౌతున్న పొగమంచులోకి ప్రవేశించాడు.

"ఇక్కడ ఆగాలి" అనుకున్నాడు రాణా పరిసరాలు పరికిస్తూ. 'ఇదే షాపింగ్ సెంటర్. తను కుడివేపుకు తిరిగితే మరాఠా దుర్గం వస్తుంది.'

మరాఠా మందిర్ ఓ చారిత్రాత్మక కట్టడం. విష మేఘం కీలకశక్తి, ఆ కోట దగ్గర్నుంచి వస్తున్నట్లు అభి ప్రాయపడ్డారు శాస్త్రవేత్తలు.

అతని వెనగ్గా పెంపుడు జంతువులా అనుసరిస్తున్న ట్రాలీ మీది సీసపుపెట్టె—వాక్యూమ్ క్లీనర్‌లా పని చేస్తుంది.

రకరకాల లోహపు గొట్టాలు ఆ పెట్టెకు ఒకవైపు తగిలించబడి వున్నాయి. వాటిని కలుపుతూ, పెట్టెకువున్న బలమైన, పొడవాటి హోస్ పైపును అమర్చవచ్చు. అప్పుడు అది పదిహేను అడుగుల పొడవు రాడ్‌లా కనబడుతుంది. ఆ పైపుని విషమేఘం అంతర్భాగంలోని న్యూక్లియస్‌లో అమర్చి, ఓ మీట నొక్కితే, ఆ పదార్థం అంతా ట్రాలీ లోని పెట్టెలోకి వస్తుంది.

ధైర్యం పుంజుకుంటూ, మరాఠా దుర్గం ఆవరణకు తీసుకువెళ్ళే వీధిలోకి వెళ్ళాడు రాణా.

వీధి యిరుగ్గా వుంది.

వారగా నడుస్తున్న రాణా, అద్దాలు పగిలి వున్న ఓ షాపుకేసి చూసి ఉలిక్కిపడ్డాడు.

కొంచెం ముందుకు వెళ్ళగానే అలాంటి మరోదృశ్యం ఎదురైంది అతనికి.

ప్రజలు పట్టణాన్ని ఖాళీచేయడం చూసి ఎవరైనా లూటీలు జరుపుతున్నారా??

ఇక్కడ వుండడం యెంత ప్రమాదమో ఆ దొంగలకి తెలీదా?

విష మేఘం ప్రభావంవల్ల మనుషులు పిచ్చివాళ్ళగా మారతారని ప్రజలందరికీ తెల్సివుండాలి.

మరి లూటీదారులు యిక్కడెందుకున్నట్లు?

వాళ్ళకి ప్రాణాలపై తీపి వుండదా?

బహుశా ప్రమాదవశాత్తు యిలా జరిగిందేమో, ఇరుకు వీధిలో ప్రయాణించలేక ఏ ఆర్మీ వాహనమో షాపుకి గుద్దుకొని వుండాలి.

లేదా ప్రాణాలను రక్షించుకుదేందుకు, ఊరిని వదిలి పెట్టే గాభరాలో ఏదో వాహనం ఆ షాపు అద్దాల్ని గుద్దుకుని వుండాలి.

కాని రెండు షాపుల అద్దాలు....?

రాణా సునిశితంగా ఆ షాపు పరిసితిని అవలోకించాడు.

నగల దుకాణం!!

గుడ్ గాడ్! ఇది లూటీయే?

ఎవరో ఈ పరిసరాల్లో.... దాక్కున్నారు!

ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేసి—

ప్రభుత్వ హెచ్చరికను పెడచెవిని పెట్టి....

దొంగతనాలు చేయడంకోసం....

వాళ్ళు యింకా ఈ చుట్టుప్రక్కలే ఉన్నారా?

లేక సులభంగా దోపిడీ పూర్తిచేసుకొని వెళ్ళి పోయారా?

"లీవిట్!" తనను తాను హెచ్చరించుకుంటూ భుజా లెగరేశాడు రాణా.

అది తన సమస్య కాదు.

ఆ చారిత్రాత్మక కట్టడాన్ని సమీపించేకొలదీ రోడ్డు మీది మేఘం దట్టంగా మారి, రాణా దృష్టి మందగించ సాగింది....కోటముందు ఉన్న పచ్చిక మైదానం వైపు అడుగులు వేశాడు రాణా, కళ్ళు చిట్లిస్తూ, మార్గం వెతుక్కుంటూ....

ఎక్కడుంది ఆ వెలుగు??

ఉంటే ఈపాటికి అది తనకు కనబడి వుండాలే?

కీలకమైన విష మేఘం మధ్యభాగం—ఈ భవనం చుట్టుప్రక్కల ఎక్కడో ఖచ్చితంగా ఉండాలని నొక్కి చెప్పారు సైంటిస్టులు.

ఈపాటికి కదిలి వెళ్ళిపోయిందేమో?

కాని పొగమంచును కదిపేటంత గాలిలేదు, ఈ ఉదయం.

భవనం ప్రధాన ద్వారాన్ని సమీపిస్తుండగా రాణాకు హీనంగా, చిన్నగా మెరుస్తున్న....ఆ వెలుగు కనబడింది!

యిది సాధ్యమేనా?

రాణా బిగుసుకుపోయాడు....

ఆ న్యూక్లియస్ .... వ్యాధిని రగిలించే మైక్రో

ప్లాస్మాకి గుండెకాయలాంటి న్యూక్లియస్.... ఈ పురాతన కట్టడంలో దాక్కొని వుందా?

గాలిలో తేలుకుంటూవచ్చి అది ఈ పురాతన గోడల మధ్య బందీ అయిపోయిందా?

మరో దారుణమైన ఆలోచన మస్తిష్కంలో ప్రకాశించడంతో రాణా ఎండుటాకులా వణికిపోయాడు.

అది తనకుతానుగా సంకల్పించుకొని, ఈ భవనంలో దాక్కుందేమో?

అది అసహజమైన ఆలోచనగా తట్టి రాణా దాన్ని మస్తిష్కంలోంచి త్రోసి పుచ్చడానికి విఫల ప్రయత్నం చేసాడు.

అది చాలా అసాధరణమైన ఆలోచన!

సైన్సు ఫిక్షన్ కథల్లో చదవడానికి బావుండే ఆలోచన.

కాని యింతకు ముందు జరిగిన దారుణ సంఘటనలన్నీ అసహజంగా లేవ్వూ?

ఒక పట్టణంలోని జనాభా నంతటినీ ఖాళీచేయించి పంపడం అసాధారణం కాదూ?

రాణా ముందుకు నడవసాగాడు, ఊపిరి బిగపట్టి ప్రతీ అడుగూ తూచితూచి వేస్తూ.

తను చూసిన వెలుగు ఖచ్చితంగా గుమ్మంలోంచి వచ్చింది.

చీకటి భవనంలో, లోపల దాగి ఉన్న పిశాచంలాంటి ఆ విచిత్ర శక్తి ఎదురుగా అడుగుపెట్టే ధైర్యం తనకు ఉందా?

గుమ్మందగ్గర తటతటాయిస్తూ లోనికి తల వొంచి చూసాడు రాణా.

ఊపిరి పీల్చడాన్కి చాలా కష్టమౌతోంది రాణాకి.

గాలిలో, ఒక విధమైన వాసన బయల్దేరి అతని ముక్కు పుటాల్లోను, గొంతుకలోను మంట రేపింది.

ముఖానికున్న స్మాగ్ మాస్క్ తొలగించి, భుజాని కున్న ఆక్సిజన్ మాస్క్ అందుకుంటుండగా రాణా కను సన్నల చివరగా ఏదో కదిలినట్లయింది.

త్రుళ్లిపడి తలతిప్పి చూశాడు రాణా కళ్లు చిట్లిస్తూ, పొగమంచులో ఆ కదలిక ఏర్పడిన దిశగా.

తన ఊహా?

అక్కడ అతనికేం కనబడలేదు సుడులు తిరుగుతున్న మేఘం తప్ప....

చెవులు రిక్కించాడు....

ఎలాంటి అలికిడీ లేదు....తన గుండె కొట్టుకునే శబ్దంతప్ప.

రాణా ఖళ్లీ ఆ 'వెలుగు' ఉత్పత్తి స్థానం వైపు దృష్టి సారించాడు.

ఆ భవనం లోపల....మధ్య భాగంలో....

మరింత శక్తివంతంగా మెరుస్తూ....

ప్రత్యేకమైన ఆకృతిలేకుండా....

చుట్టూ ఉన్న చిక్కని పసుపుద్రవం.... నిర్విరామంగా కదుల్తూ అప్పుడప్పుడు మెరుపుని కప్పేస్తూ....

స్పష్టమైన....పరిశుభ్రమైన....పసుపురంగులో ఉన్న

న్యూక్లియస్!!

దాని చుట్టూ రక్షక తెరలా అల్లుకుని కాపాడుతున్న లేతరంగులో ఉన్న విష మేఘం!........

(ఇంకా వుంది)